# యాత్ర

## ఎక్సురే 33 ✦ "విహారి"

ఉదయమే లేవడం, హోంవర్కు గట్రా చూచుకోడం. భత్తా ముగించుకొని బడి
కళ్ళేఁల, ఆలబాన మట్టుకు, అదృష్టమున్న మట్టుకు! అవకాశం లభించిన మట్టుకి గురువుగార్లు జారవిడిచిన విషయాల్ని యిష్టంవున్నవాడు వున్నట్టు బుర్రలోకి యెక్కించుకోవడం, తిరిగి కాళ్ళీడ్చుకుంటూ రొండు మైళ్ళుదాటి కొంపలకి చేరుకోవడం, చదివినా చదవకున్నా గప్పాలతో కాళ్ళేపు కాలక్షేపం చేసి రాత్రికి యథాస్థానాల్లో ప్రాప్తం వున్నమట్టుకి మెతుకులు గతకడం, బిఛానా వెయ్యడం యీ వృత్తాకారంలో రొటీనుగా జరుగుతూ వొస్తూండే కార్యక్రమంతో ప్రాణం విసికి బేజారెత్తిపోయింది. వోరొండు పూటలు యెక్కడికైనా కాలుఝాడిస్తేనేగాని గడిచెట్టు తోచలా.

"యేంరా" అంటూ నేనేముందు కొడెత్తా. మా తమ్ముడూ, రామకృష్ణయ్యా, నరసింహం అదివరకే సిద్ధంగా వున్నారు కాబట్టి "చల్ మోహనరంగా" అని వో గంతేశారు. వెళ్ళాలసిన స్థలం నిమిషంలో ఓటుతో పనిలేకుండానే నిర్ణయమైపోయింది. యింకా కొంతమందిని పోగుచేసుకొని వెళదామనే-విషయంమీద చర్చిజరిగి తోసివేయబడ్డది. మావాడు "అక్కడే వంట చేసుకుందాం" అన్నాడు తిండి విషయంలో అభిమానం కలవారు కాబట్టి. "సొర్గానికెళ్ళినా వొడేకులు తప్పవా!" అని నేను అవుపపాదన్ని యెదిరించా. "ఔను స్వేచ్ఛగా అక్కడైనా ఇంత తిరుక్కుండా వొండుకోటం వార్చుకోటంతోనే సరా! వంటకు నేనేమాత్రం వొప్పుకోను"అని నామాటను బలపరిచాడు రామకృష్ణయ్య. 'పులిహోరా, పెరుగన్నం కావలసినంత యిక్కణ్ణుంచె తీసికెళితే తిరిగి వొచ్చేవరకూ రుచులూరుతూ సరిపోతుంది" అనే విషయాన్ని సభ్యులముందు దాఖలు చేసుకున్నా -నేను. అచారానికి లోపం అవుతుందన్న విధంగా

సకిలించి మూతివిరిచాడు మావాడు. రామకృష్ణయ్య "బా గా నే వుం ది" అ న్నా డు.
కాని నరసింహానికి యీ వ్యవహారం నచ్చలా. ఆరో జుల్లోనే అపక్వాహారసేవనంమీది పుస్తకాల్ని ఆప్టే తిరగేస్తున్నాడు కాబట్టి అపక్వాహారాన్ని శాస్త్రీయంగా వొక్కసారి సేవిస్తే అరవై గంటల వరగ్గూడా ఆకలికాదనీ, శాల్యాన్నంలా భుక్తాయాసం, దప్పి కలిగించక చులాగ్గానూ, బలంగానూ వుంటుందనీ వొక్కటిగిన వో లెక్చర్ విసిరి, మన నలుగురికీ తిరిగి వొచ్చేవరకూ వో నాలుగు డజన్ల చక్కెరకేళీలూ. వో అరవీశె యెండుఖర్జూరకాయలూ సరిపోతాయని ముగించాడు. "యెందుకోయ్ యింత ఆయాసం, ఆవూరు యెంత కుగ్రామమైనా వో అయ్యంగారి హోటలుందిలే." అని చెవుల్లో అమృతం పోశాడు పొరుగింటాయన.

నూతనవిషయాల్లో ముందూవెనకా చూడకుండా దూకడం మాప్రాంతాల్లో సహజంకాబట్టి లోపల ప్రాణం వొ[illegible]కున్నా, చివరకి నరసింహంమాటకే అందరమూ తలలూపాం, అదీకూడా చూద్దామని. తెల్లవారుగట్ల $3\frac{1}{2}$ గంటకి **Exoursion** కి బయలుదేరాం పొగబండిమీద. ఈతినుబండాలతోపాటు తిరుగు రైలుఖర్జీదాక అక్కడ కొనాలసిన వస్తువులు యేవీవుండవు కాబట్టి కొద్దిగా కాపర్సుమాత్రం అధికంగా తీసుకున్నాం యెటూ హోటలుందని తెలిసిపోయింది కాబట్టి యెందుకైనా మంచిదేనని.

"వూరు దగ్గర్నేవుంది, యిక్కడ సేష్టీలేదు. దయచెయ్యండి." అని పురమాయించాడు బండి దిగంగానే స్టేషన్‌మాస్టరు. తన కాంపుతల్పం మీద శయనిస్తూ. అంతటా గాఢాంధకారంగా వుంది. మేం యెక్కచూడాల్సిన కొండ దూరంగా, మరింతనల్లగా ఆకాశంలోకి నిక్కుతూ కనపడుతూంది. మా పొగబండి దూరంగా చీకట్లో దూరి

వెళుతూ, రొప్పుతూంది. అక్కడదిగిందంతా మేం నలుగురమే. కొత్త ముసాఫిరం కాబటి మాసర్వ
గారమాటకు వ్యతిరేకంగా అక్కణ్ణే వో తోళ్ళ కట్టపక్కన్నే బిఛానా గట్రా తెచ్చుకోలేదు గాబట్టి వొట్టినేలమీదనే.

తెల్లవారింది. కొండమీది పాడుబడ్డకోట విస్పష్టంగా కనపడసాగింది. ఆ కోటలోవుండే భవనాలు వగైరా (పాడుబడ్డవి) చూడాలనీ, మన పూర్వపాలకుల కథ వినాలనీ ప్రాణాలు వుబలాటపడసాగాయి. "యిది ఫలానిది" అని చెప్పగల వొక అనుభవజ్ఞుడు అవసరమనితోచింది. కనబడుతున్న గ్రామంలోకెళ్ళి విచారించాలని బయలుదేరాం. మార్గంలో వో పల్లెటూరి మనిషి కలిసి, మాకథ విచారించాడు. మాకో **Guide** కావాలని సూచించాం. అరణాల కూలీమీద తానే గయిడుగా వుండి యీనాటకం పూర్తిచేస్తానని వాడు వొప్పుకున్నాడు. అంతేకాకుండా మాకోదారిచూపి "సరిగా మెట్లకాడికెళ్ళి కూచోనివుండండి తొందరగా వొక్కబుక్కబువ్వతాగి యిప్పుడేవొచ్చేస్తా" అని గయిడు వూరివేపు చురుగ్గానడిచాడు. చిన్నప్పుడు మావూళ్ళోవేసిన చిలకమర్తివారి నాటకంలో గయుడువేసిన రాఘవుడుకూడా యీ మనిషిలానే ముస్తాబైనసంగతి జ్ఞాపకం వొచ్చినప్పట్నుంచి యే అర్థంలోవున్నా కథ పూర్తయేవరకూ సంబోధనలోనూ, చెప్పేటప్పుడు ఆ మనిషిని గయుడనే వాడుతూవొచ్చాం మేమందరమూ.

గయుడు వొచ్చాక మేమందరం బయలుదేరాం. ఆ కోటలోవుంటూ చుట్టూపట్ల రాజ్యాన్ని ఫలానా ఫలానారాజులు పాలించారనీ, ఫలానా ఫలానావిధంగాపరిపాలనజరిగిందనీ,చివరికిఫలానా ఫలానా కారణాలవల్ల రాజులందరూ నశించారనీ, శత్రు రాజులువొచ్చి కోటకొల్లగొట్టి అంతా నానా పాడుచేశారనీ, తాను ఆకాలంలోవుండి చూచినవాడికంటే అధికంగా వర్ణించి చెబుతూ నడిచాడు గయుడు. కొండ పై భాగం చేరుకున్నాం. [illegible] పోయి ముళ్ళకంపలతూ, పెద్దపెద్దవృక్షాల్లతూ అల్ల

వాలమైన వేర్వేరు మిద్దెల్నీ మంటపాల్నీ చూపిస్తూ, "యిది ఖజానాకొట్టు—యిది యేనుగలచావడి—యిది జనానామేడ—అది కచేరి అరుగూ—అంటూ వొంటిగంట తిరిగేవరకూ చూపుతూనే తిప్పాడు గయుడు. అంతకంటే వేరే గతిలేదు కాబట్టి వానిమాటలన్నీ వ్యాసప్రోక్తంగా భావించసాగాం మేం.

తర్వాత వోకుంటదగ్గర స్నానాలు ముగించుకొని, ముమ్మందుగా చక్కరకేళీలను చక్కపెట్టాం. కాని కడుపేనిండలా! ఖర్జూరకాయల్నితలా వో అరడజనువరకూ సాధించకలిగాం. దాంతో పళ్ళు మెత్తబడ్డాయి కడుపా నిండలా! అందరం అలసి వో చెట్టుకింది బండమీద కూలబడ్డాం సొటసొట్లాడుతూ. నరసింహం కిక్కురమనకుండా కూచున్నాడు మొదట్లో కడుపు పూర్తిగా నిండినవాడికిమల్లే. తర్వాత ప్రాక్టీసు చాలా అవసరమంటూ వుపన్యాసం ప్రారంభించి మాలో కలుసుకున్నాడు పొట్ట చేత్తోపట్టుకొని. తెచ్చుకున్న రొట్టె నమిలి, నీళ్ళుతాగి, బండమీద శరీరం పారేసి నిద్రించాడు, చింతా—చీకూ లేకుండా, గయుడు. మేం తిరిగి మరోసారి ఖర్జూరకాయలమీదికి చేతులుపోనిచ్చాం. ఊ—హూ—! పళ్ళు తిరుగుబాటుచేశాయి. అందరం నరసింహంమీద వోసారి గుడ్లురిమి కూలబడ్డాం.

అడివిలో కట్టెలు కొట్టుకునే వోమనిషి యింతలో వో తేనెతెట్టెపట్టుకొనివొచ్చేసి "కొనుక్కుంటారా?" అన్నాడు. కడుపుకాలే ఆత్రంలో వెనకముందులు చూడకుండా వోపావలాకు ధర తెంచేశాం. వో అరసోలెడుతేనెను రాతిమీది గుంటలో పిండి కట్టెల మనిషి సెలవుతీసుకున్నాడు. జువ్విఆకులు దొన్నెలు కుట్టుకొని భాగవరసనా తలా నాలుగు దొన్నెలుమాత్రం తాగ్గలిగాం. అతివెగటేసింది. మా సోదరుడు మిగతా పదార్థమంతా వొక్కనాలికె రుటకాయింపుతో సొమ్ముచేశాడు చీమగ్గూడా మిగలకుండా.

కొన్నినిమిషాలు గడిచాయోలేదో అతిగా దాహం వెయ్యడం మొదలుపెట్టింది. నాలుకలు కరుఖ్ఖకట్టసాగాయి. గయుణ్ణిలేపి వాడిసహాయంతో సెలయేటికివెళ్ళి నీరుతాగాం. కాని దప్పితీరలా! నీరు తాగితాగి పొట్టలు బీరకాయల్లా దిగబడ్డాయి. కాని నోటమాత్రం తడిలేదు. ఇలా వుంటే యింక కొన్నినిమిషాల్లో మాపని తీరుతుందనిపించింది. వెంటనే కొండదిగడం ప్రారంభించాం. ప్రతి కనపడ్డచెట్టుపేరూ చెప్పాలని గయుడికి మొట్టమొదట్లోనే ఆజ్ఞాపించాం కాబట్టి వాడు తన పాటపాడుతూ, వ్రేలితో చూపుతూ మావెంట నడిచాడు. అంతకష్టంలోవున్నా వొకే జాతిచెట్టును వేరువేరుచోట్ల వేరువేరుపేర్లతో చెప్పడమూ, వేరువేరుచెట్లను వొకేపేరుతో చెప్పడమూ మేము గమనిస్తూనేవున్నాం కాని, వానితో వాదించేవోపికా, బలమూ యెక్కడుంది?

కొండదిగాం. హోటలుదారి చూపమని అడిగాం గయుణ్ణి. "అదో—ఆ కనపడేమిద్దే—నేనక్కడికిరాను—మీరే యెల్లిరాండి" అన్నాడు గయుడు. మేం యెకాయెకీ హోటలు దగ్గరికివెళ్ళి విచారించాం హోటలు యజమాని (అసలుపేరు విచారించే పురసత్తు దొరకలా. గయుడు మాత్రం "స్త న శ య న ం గా రు" అని చెప్పినట్లు జ్ఞాపకం) వారు శయనించి ఆకులు తింటూ (తాంబూలం వేసుకొంటూ) "యిది యేమియా—యింత పొద్దుదా అయింది—మీరుదా ముందుగా యింటిమేషణ్దా యిచ్చి వుంటే, బాహోవుణ్ను—యిపుడు నేనుదా వొంటరి వాడు—సక్తిలేదు అన్నాడు. మేమూ చేసేదిలేక వెనక్కి తిరిగాం. ఆసమీపంలో మరోయిల్లుంది. వాకిట్లో గోనె సంచి చూచి బయట్నించే విచారించాం, పాలేమయినా దొరుకుతాయేమోనని. లోపలినుంచి ఓ వృద్ధుడు వచ్చి పదణాలు పుచ్చుకొని అర్ధశేరు పాలు లోటాలో పోసి యిచ్చాడు. యింతే చాలని నలుగురమూ నాలుగు గుక్కలు మింగి సంతోషించాం.

తర్వాత యీ యాత్రకి కొలికిపూసలాంటి మరోచోటికెళ్ళాం. గయుడు దమ్మిడీకూడా ఖర్చుకాకుండా నేర్చుకున్న స్థలపురాణం యేకరుపెట్టాడు. వో శిథిలాలయాన్ని చూపుతూ. మేము యీగర్‌గా లోపలా—బయటా చుట్టుపట్లా బాగా పరిశీలించిచూచాం, ముందుభాగం సగంలో వో పూజాపునస్కారాలు లేక బూజుపడుతూన్న మశీదూ, వెనకభాగం గబ్బిల్లాలు జిరాయితీ చేసుకున్న శిథిలాలయం. ఆలయమంతా హతశేషమైన శిల్పాలతోనిండివుంది. ఆప్రాంతంలో ఆపాటి చెక్కడపుపని లేదనిచెబితే అతిశయోక్తికాదు. అంతా గడ్డపారపోట్లమయం. నాతమ్ముడూ మిగత స్నేహితులూ లోలో యేమో అనుకొని గుడ్లనీళ్ళు కుక్కోసాగారు యెందుకో. కాని, నాకుమాత్రం కోపంవొచ్చింది. యెవరు పీక్కుతిన్నది యేమీ లేదు. ద్వేషంమూలంగా యీ రొండిట్లో వొకటైనా బాగుపళ్ళా. యీ భాగ్యానికేనా యింత గుంజులాట? రక్తపాతం? యీనాటికీ, యింకముందు యేనాటికీ తెగనిపతనం?—యింకా కొందరి హామీలు నమ్మాలిట—కొందరి హామీలు నమ్మడానికి ఆధారాలులేవుట! యేమి విచిత్రవితండవాదం! అనిపించింది. అక్కడ వోక్షణంగూడా కూచోను మనస్కరించలా. స్టేషనువేపు బయలుదేరాం గయుణ్ణి కూలిచ్చి, సాగనంపి.

సగపడ నడిచివుంటాం ఆకలితో అవతాగిన లాంటి మనస్సుతో నాలుగ్గంటలై వుండొచ్చు. నడస్తూ నడస్తూ, ప్రకృతంలోకి దిగాం. హోరాహోరిగా పోరాడదగ్గ విషయాలు అధికంగా వున్నా, ఓపికలేకపోవడం కారణంగా వున్న నిల్లు యేమాత్రమోనని చూచుకున్నా. సరిగాముప్పావలా వుంది. యింకో అర్ధరూపాయైనా అయితేనే గాని రథాలు కుదటపడవు, యిక్కణ్ణా యెరిగిన నరమానవుడు లేడు. యెవడిస్తాడు మాముద్దు మొఖాన్ని చూచి? మరి గతి? బుద్ధిలేకుండా చేసిన పనులలో యిది రొండోది. యెందుకు యాడవడానికా చదువు? యెవర్ని యేమనుకోవాలి? వొకరి మొఖాలు వొకరం రూక్షంగా చూచుకొన్నాం పోతూన్న ప్రాణాలతో. యెవరూ మాట్లాళ్ళా. చివరకి నేనే ధైర్యంచేసి "యెలాగైనా వెళ్ళితీరాలి. యిక్కడవుంటే రాత్రిగ్గూడ భుక్తి సున్నా పడుతుంది. అయినా అప్పటికే మనప్రాబ్లం సాల్వు కాదు. యింతకంటే చెడిపోం నడవండి యేడుస్తూ ఆముందు స్టేనువరకూ. ఆరుమైళ్ళేగా! "అని. గుడ్డపేలికల్లా లాక్కొని పోతుండే కాళ్ళతో రాత్రి యేడుగంటలయేసరికి ముందు స్టేషన దగ్గరకి చచ్చి చెడి, చేరుకున్నాం. యింకా వో గంటగ్గాని రైలు రాదన్నారు. అందరికి కొండంత జ్వరం వొచ్చేసింది.

రైలు యెప్పుడు వొచ్చిందీ, టిక్కెట్టు యెవరు కొన్నదీ, రైలు ఎలా ఎక్కిందీ, నామటుకి నాకు తెలీనేతెలీదు. స్వస్థలంచేరాక కొంచెంగా తెలిసింది. అందరూ లాడ్జింగ్సుకి వెళ్లారు. యింటివారు మాకు కేవలం కావలసివాళ్ళు కాబట్టి యీపూటకి తిండికి అక్కడే వుండమంటారనిమాత్రం నాకు తోచింది. కాబట్టి హోటలుకెళ్ళాలనే మిషతో వెనక్కితగ్గా. మా హోటల్ కీపరు యెన్నడో యేరుదాటాడు. (నిద్రపొయ్యాడు) మెల్లిగా బస చేరుకున్నా. మిగత ముగ్గురూ యథాశక్తి ప్రసాదం ఖండించి శయనించారు. గేస్తురాలు నాతో "భోంచేశావుట్రా" అంది. వొచ్చేప్రాణం—పొయ్యేప్రాణంతో "—ఆ—అయింది" అన్నా ప్రెస్టీజికి లోపంరాకుండా.

ఆరోజు మొదలు వారంరోజులవరకూ నిజంగా భోజనంచేసేపని తప్పింది. లంఘనాలే! యిరవైరోజులవరకూ నేను తేరుకోలేకపొయ్యా. తర్వాత యీ యాత్రను గురించి ప్రస్తాపం వొచ్చినప్పుడంతా వో రొండుగంటలు కాలక్షేపం గ్యారంటీగా జరుగుతూంది.